TGTEL/26/A4015

తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 14 బుధవారం అక్టోబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 156 తెలుగువారి పత్రిక..... మీ కోసం

రిపోర్టర్లు కావలెను

తెలంగాణ మంజీరా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న

తెలంగాణ మంజీరా

మీకు సరైన వేదిక... అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.

98496 38320

హాస్టళ్లకు సరుకుల సరఫరా స్థానిక వెండర్లకే ఇవ్వాలి

అక్టోబర్ 13 (తెలంగాణ మంజీరా):



రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సరకుల సరఫరా చేసే విధానంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సరకుల సరఫరా కోసం నూతనంగా ప్రవేశపెట్టిన పీఎంయూ (ప్రాజెక్ట్ మేనేజ్ మెంట్ యూనిట్) టెండర్లను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విధానం స్థానిక చిరు వ్యాపారుల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, గతంలో మాదిరిగానే పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి, డీపీసీ (జిల్లా కొనుగోలు కమిటీ) ద్వారా స్థానిక వ్యాపారులకే సరఫరా బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. అప్పుడే చిరు వ్యాపారులకు భరోసా ఉంటుందని, విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుతాయని పేర్కొన్నారు. స్థానిక వ్యాపారులకు అవకాశం ఇవ్వకుండా ఒకే సంస్థకు టెండర్లు అప్పగించడం వెనుక భారీగా కమీషన్ల ప్రయోజనాలు ఉన్నాయని ఆయన విమర్శించారు'కేవలం కమీషన్ల కోసం కక్కుర్తిపడి, ఇప్పటికే బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఒక సంస్థకు టెండర్లుకట్టబెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని హరీశ్‌రావు మండిపడ్డారు.

విజయవాడలో తెలుగులో ప్రసంగించిన సీఎం విజయ్..
బెజవాడలో విజయవాడ ఉత్సవ్ 2.0

- హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్
- తెలుగులో మాట్లాడి అందరినీ అలరించిన విజయ్
- తనను ఆహ్వానించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు

అక్టోబర్ 13 (తెలంగాణ మంజీరా):

తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్.. విజయవాడలో తెలుగులో ప్రసంగించి అందరి హృదయాలను గెలుచుకున్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో అట్టహాసంగా జరుగుతున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0' వేడుకలకు ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్, కాస్త తడబడుతూనే తెలుగులో మాట్లాడటం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "అందరికీ నమస్కారం. మిమ్మల్ని అందరినీ కలిసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అంటూ విజయ్ తన ప్రసంగాన్ని మొదలుపెట్టగానే అక్కడున్న యువత కేరింతలతో హోరెత్తించారు. తన పర్యటన ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, "నదుల అనుసంధానం గురించి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారితో చర్చించేందుకు విజయవాడ వచ్చాను" అని స్పష్టం చేశారు. తన ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, తనను ఆహ్వానించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, విజయవాడ ఉత్సవ్‌తో నగరంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొందని నిర్వాహకులను అభినందించారు. తమిళనాడు సీఎంగా గెలిచిన తర్వాత విజయ్ మొదటిసారి విజయవాడ రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రాలు వేరైనా తమ అభిమతం ఒక్కటేనని, దేశం బాగుపడాలని చంద్రబాబు అన్నారు. ఈ వేడుకలకు హాజరైన సీఎం విజయ్‌కు, కళాకారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఓటు హక్కు పరిరక్షణ మరో స్వాతంత్ర్య పోరాటమే

- 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' అంటూ ఉద్యమించాలని సీఎం పిలుపు
- ఓటర్ల జాబితా సవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శ
- ఈసీ నియామక ప్రక్రియను మార్చడంపై మండిపాటు
- ఓట్లు తొలగించే ప్రయత్నం జరుగుతోందన్న రేవంత్‌రెడ్డి

జీవో 134 ఒక కుట్ర.. కక్ష సాధింపే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

- జీవో 134 రాజ్యాంగ విరుద్ధమన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- ఇది కేవలం బీఆర్ఎస్ నేతలే లక్ష్యంగా తెచ్చిన జీవో అని ఆరోపణ
- సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి భూములపైనా విచారణ జరపాలని డిమాండ్

అక్టోబర్ 13 (తెలంగాణ మంజీరా):

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 134 రాజ్యాంగ విరుద్ధమని, రాజకీయ కక్ష సాధింపు చర్య అని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు. ఈ అంశంపై అసెంబ్లీలో ఏకపక్షంగా చర్చ జరిగిందని ఆయన విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని, చట్టం ముందు సమానత్వం అనే సూత్రాన్ని ఇది దెబ్బతీస్తోందని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ ఉత్తర్వుల జాబితాలో కేవలం బీఆర్ఎస్ నాయకుల భూములే ఉన్నాయని, ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్ర అని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర మంత్రులు ముందే ప్రణాళిక వేసుకుని ఈ జీవోను తీసుకొచ్చారని విమర్శించారు.సెప్టెంబర్ 7న ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీ నేతలను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకున్నారని, చర్చలో పాల్గొనకుండా అసాధారణ రీతిలో సస్పెండ్ చేశారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు సమస్యలపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమైనా, వారికి అవకాశం ఇవ్వలేదని వాపోయారు భూవివాదాలను పరిశీలించే కమిటీ.. రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర కాంగ్రెస్ నేతల భూములపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు లేఖ రాసినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు.

కరెంట్, నీళ్లు ఇవ్వలేరు కానీ.. బుల్లెట్ ట్రైన్లు గురించి మాట్లాడుతున్నారు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్ర విమర్శలు
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ ఖరారు కాకుండానే భూసేకరణ చట్టవిరుద్ధమని ఆరోపణ
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాలు బలవంతంగా లాక్కుంటున్నారని ధ్వజం

అక్టోబర్ 13 (తెలంగాణ మంజీరా):



తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా అలైన్‌మెంట్ ఖరారు చేయని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆమె మండిపడ్డారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటనను ప్రస్తావిస్తూ, బుల్లెట్ ట్రైన్ రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదని, అలాంటప్పుడు బహదూర్‌గూడలో పోలీసుల రక్షణతో రైతుల భూములను ఎందుకు తీసుకున్నారని సబిత ప్రశ్నించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలను ప్రభుత్వం అనవసరంగా సేకరిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డికి ఇంత భూదాహం ఎందుకో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

చెన్నైకి తాగునీరు ఇవ్వండి చంద్రబాబును కోరిన సీఎం విజయ్

-ఉండవల్లిలో ఏపీ, తమిళనాడు ముఖ్యమంత్రుల సమావేశం

-చెన్నై తాగునీటి అవసరాల కోసం అదనపు జలాలు కోరిన సీఎం విజయ్

-గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చర్చించిన చంద్రబాబు

-నీటి లభ్యతను బట్టి సాయం చేస్తామని చంద్రబాబు హామీ

-ఇప్పటికే చెన్నైకి 4.08 టీఎంసీలు విడుదల చేశామని వెల్లడి

అక్టోబర్ 13 (తెలంగాణ మంజీరా):

తమ రాష్ట్ర రాజధాని చెన్నై నగరం ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తెలుగు గంగ ద్వారా అదనపు జలాలను విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన, మంగళవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల అంశంపైనే చర్చలు జరిగాయి.ముఖ్యమంత్రి విజయ్‌కు, ఆయన వెంట వచ్చిన అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో చెన్నై నగర తాగునీటి అవసరాలను తీర్చడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింతగా సహకరించాలని సీఎం విజయ్ అభ్యర్థించారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా నదిలో జలాల లభ్యత గణనీయంగా తగ్గి, ఏపీలోనే తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయినప్పటికీ, పొరుగు రాష్ట్ర దాహార్తిని తీర్చాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఓటు హక్కు పరిరక్షణ మరో స్వాతంత్ర్య పోరాటమే

మొదటిపేజీ తరువాయి

ఓటు హక్కును కాపాడుకునేందుకు చేస్తున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమం లాంటిదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో 'సైమన్ గో బ్యాక్' అన్నట్టుగా.. ఇప్పుడు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' అనే నినాదాలతో పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని ఆయన పిలుపునిచ్చారు.సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 'ఓటు బచావో... దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో రేవంత్ మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) పేరుతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో కుమ్మక్కై ఓట్లను తొలగించేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు.గతంలో నెహ్రూ, ఇందిరా గాంధీ, వాజ్‌పేయి హయాంలో జరిగిన ఎస్ఐఆర్.. ఓటు హక్కు లేని అర్హుల పేర్లను చేర్చడానికే ఉపయోగపడిందని సీఎం గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత మోదీ-అమిత్ షా ప్రభుత్వం మాత్రం ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారి పేర్లను తొలగించే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు.రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలను వాడుకున్న కేంద్రం, అవి సరిపోవన్నట్టు ఇప్పుడు ఎస్ఐఆర్‌ను తెరపైకి తెచ్చిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం లాంటి స్వతంత్ర వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. గతంలో ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ఈసీలను నియమించేదని, కానీ మోదీ ప్రభుత్వం 2023లో సీజేఐ స్థానంలో కేంద్ర హోంమంత్రిని చేర్చి పారదర్శకతను దెబ్బతీసిందని మండిపడ్డారు.ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ పరిశీలకులు సచిన్ సావంత్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ

36 రకాల నైవేద్యాలు సమర్పించిన పురోహితులు.. మంగళహారతులతో పూజలు నిర్వహించిన మహిళలు

శంకరపట్నం , అక్టోబర్ 13 (తెలంగాణ మంజీరా) :

శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో భవానీ మాల యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాదేవి అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, అమ్మవారిని దర్శించుకునేందుకు స్థానిక భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని భక్తులు పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పురోహితులు సుమన్ శాస్త్రి నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి 36 రకాల నైవేద్యాలను సమర్పించి భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు. అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం విశేషమని భక్తులు పేర్కొన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.ఉత్సవాల్లో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంగళహారతులతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తిపాటలు, పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.భవానీ మాల యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుండటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు, మహిళలు, భవానీ మాల యూత్ సభ్యులు పాల్గొని ఉత్సవాలను

విజయవంతం చేశారు.

విధి నిర్వహణలో ప్రతిభ.. కేశవపట్నం పోలీసులకు ప్రశంసాపత్రాలు

సీపీ గౌస్ ఆలం చేతుల మీదుగా అందజేత

శంకరపట్నం , అక్టోబర్ 13 (తెలంగాణ మంజీరా) :

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సమర్థవంతమైన పోలీసు సేవలు అందించిన కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సిబ్బందికి ఉన్నతాధికారుల నుంచి గుర్తింపు లభించింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వారి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి, ఏఎస్ఐ సంపత్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు చందు, వంశీకృష్ణ, సమత ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు. విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, పోలీసు శాఖకు అందించిన సేవలను గుర్తిస్తూ వారిని ఈ సందర్భంగా అభినందించారు.సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రాలుప్రజలకు రక్షణ కల్పించడం, శాంతిభద్రతలను కాపాడటం, నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడం పోలీసుల ప్రధాన బాధ్యతలు. ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ విధులు నిర్వర్తించడం పోలీసు సేవల్లో కీలకమైన అంశం. ఈ క్రమంలో కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించినందుకు గుర్తింపుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం, పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయడం వంటి అంశాలను ప్రోత్సహించడమే ఈ గుర్తింపు ఉద్దేశమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచే సిబ్బందిని గుర్తించి అభినందించడం ద్వారా పోలీసు శాఖలో మరింత ఉత్సాహం, బాధ్యతాయుతమైన పని సంస్కృతిని పెంపొందించవచ్చని అధికారులు భావిస్తున్నారు.ఇతర సిబ్బందికి స్ఫూర్తిదాయకంపోలీసు శాఖలో ప్రతి ఉద్యోగి ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించడం వల్ల ఇతర పోలీసు సిబ్బందికి కూడా ప్రోత్సాహం లభిస్తుంది. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంతో పాటు నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే దిశగా సిబ్బందిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ గౌస్ ఆలం చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న కేశవపట్నం పోలీసు సిబ్బందిని పలువురు అభినందించారు. ఈ గుర్తింపు భవిష్యత్తులో మరింత అంకితభావంతో విధులు నిర్వహించేందుకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

వైద్య శిబిరాలతో అనారోగ్య సమస్యలు దూరం.

జిల్లా జడ్జి ఎస్ శివకుమార్...

కరీంనగర్ తెలంగాణ మంజీరా

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడం ఎంతో అవసరమని అనారోగ్య సమస్యల పరిష్కారానికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని కరీంనగర్ జిల్లా జడ్జి ఎస్ శివకుమార్ తెలిపారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫార్చ్యూన్ మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు,కోర్టు సిబ్బంది తోపాటు వారి కుటుంబ సభ్యులకు మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి హాజరై జిల్లాజడ్జి ప్రారంభించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ నిత్యం విధుల నిర్వహణలో న్యాయవాదులు,కోర్టు సిబ్బంది బిజీగా ఉంటారని ఇలా కోర్టు ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం వల్ల వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడానికి సమయం వృధా కాకుండా సులువుగా ఉంటుందని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం నిర్వాహకులు హాస్పిటల్ చైర్మన్ ముప్పిడి రాజశేఖర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మం,ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా జడ్జితో పాటు మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేష్ లకు వైద్య పరీక్షలు నిర్వహించారు . ఈ వైద్య శిబిరంలో 170 మందికి టు డికో, ఈసీజీ, బీపీ,షుగర్ చెకింగ్,జనరల్ పరీక్షలు నిర్వహించారు.దీనిలో డాక్టర్లు తిరునాధర్, మహినుద్దీన్,వర్షా,ఐక్య లువైద్య పరీక్షలు జరుపగా,క్యాంపు ఇన్చార్జి గణేష్ పర్యవేక్షణ లో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు,కోర్టు సిబ్బంది, కోర్టు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అగ్రజ్‌కు బంగారు పతకం

-రాష్ట్ర స్థాయి పోటీలకు అగ్రజ్ ఎంపిక-విద్యార్థిని అభినందించిన ప్రిన్సిపాల్ సిజ్జు ఎస్ నాయర్

సుల్తానాబాద్, సెప్టెంబర్-13 తెలంగాణ మంజీరా

జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సుల్తానాబాద్‌కు చెందిన విద్యార్థి డి. అగ్రజ్ అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ స్విమ్మింగ్ పోటీల్లో అగ్రజ్ ఈ ఘనత సాధించాడు.సుల్తానాబాద్‌లోని కేరళ మోడల్ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న డి. అగ్రజ్ అండర్-పద్నాలుగు సంవత్సరాల బాలుర విభాగంలో యాభై మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ స్విమ్మింగ్ పోటీలో పాల్గొని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. తన ప్రతిభతో బంగారు పతకాన్ని సాధించి పాఠశాలకు, పట్టణానికి గర్వకారణంగా నిలిచాడు.ఈ విజయంతో అగ్రజ్ వచ్చే నెలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కేరళ మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిజ్జు ఎస్. నాయర్, వైస్ ప్రిన్సిపాల్ స్మిత ఎస్. నాయర్, పీఈటీలు ఎ. అజయ్, డి. రాజుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అగ్రజ్‌ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు..

మహాలక్ష్మి యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవికి దీపారాధన కార్యక్రమం

తెలంగాణ మంజీరా రుద్రంగి

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నయి మహాలక్ష్మి యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గాదేవి అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపారాధన చేశారు.దీపాలతో అమ్మవారి రూపాన్ని అలంకరించి మహిళలు భక్తిని చాటుకున్నారు.అలాగే అమ్మవారికి ఇష్టమైన పూజ కార్యక్రమలు అన్నదాన కార్యక్రమలు బోనాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా మహాలక్ష్మి యూత్ సభ్యులు మాట్లాడుతూ.ప్రతి సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహాలక్ష్మి యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు తెలిపారు.తొమ్మిది రోజులు జరిగే పూజ కార్యక్రమల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గాదేవి ఆశీస్సులు పొందాలని కోరారు....

ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కృషితో ఆదిలాబాద్ జిల్లాకు రూ.1.50 కోట్ల నిధులు మంజూరు

-రాష్ట్రవ్యాప్తంగా రూ.3.50 కోట్లు.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే రూ.1.50 కోట్లు!

మంచిర్యాల జిల్లా ప్రతినిధి 13 అక్టోబర్ (తెలంగాణ మంజీరా)

ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ కృషితో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో దండారి--గుస్సాడీ నృత్య ఉత్సవాల నిర్వహణకు రూ. 1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గిరిజన జాతరలు, ఉత్సవాల కోసం ప్రభుత్వం రూ. 3.50 కోట్లు కేటాయించగా, అందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రూ. 1.50 కోట్ల నిధులు మంజూరు కావడం విశేషం.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు పెద్దపీట వేస్తూ, దండారి--గుస్సాడీ వంటి తరతరాల వారసత్వ కళారూపాలకు మరింత ప్రోత్సాహం అందించేలా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేసిన కృషి ఈ నిధుల మంజూరులో కీలకంగా నిలిచింది. ఆదివాసీల పండుగలు, సంప్రదాయాలు వైభవంగా కొనసాగేందుకు ఈనిధులుదోహదపడనున్నాయి.ఆదివాసీల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి, సంబంధిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు...

బిజెపి సీనియర్ కార్యకర్త పబ్బ తిరుపతిని ఫోన్‌లో పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ తెలంగాణ మంజీరా



తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ కార్యకర్త, బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి ఇటీవల ప్రమాదవశాత్తూ ఆటో పై నుండి కిందపడటంతో ఆయన కాలు తీవ్రంగా గాయపడి ఫ్రాక్చర్ అయింది. ప్రస్తుతం ఆయన కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతికి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తిరుపతికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు ఫోన్ ద్వారా సూచించారు.ఈ సందర్భంగా బిజెపి మాజీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతూ... కేంద్ర మంత్రి బండి సంజయ్ పవిత్రమైన భవానీ దీక్షలో ఉండి కూడా, కార్యకర్త సంక్షేమాన్ని గుర్తుంచుకుని ఆరోగ్య పరిస్థితిపై వెంటనే స్పందించడం, ఆయనకు కార్యకర్తలపై ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనమని కొనియాడారు. కార్యకర్త కష్టాల్లో ఉన్నాడని తెలిసిన వెంటనే స్పందించి ధైర్యం చెప్పడం అభినందనీయమని, ఈ విషయంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కు తిమ్మాపూర్ మండల బిజెపి పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

నెస్ట్ వృద్ధాశ్రమం పరిశీలన

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

అమీన్ పూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య అమీన్‌పూర్‌లోని శ్రీవాణి నగర్‌లో ఉన్న ది నెస్ట్ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అనం తరం వృద్ధాశ్రమంలోని వృద్ధులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు కల్పిస్తున్న వసతి, ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, ఇతరాత్ర మౌలిక సదుపాయాల గురించి వివరాలు తెలుసుకున్నారు. వృద్ధులకు నాణ్యమైన ఆహారం, తగిన వైద్య సంరక్షణ, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి ఆరోగ్యం, భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు, వారి దైనందిన జీవన పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్నవారికి శారీరక సంరక్షణతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మీయత, గౌరవం, భావోద్వేగపరమైన మద్దతు ఎంతో అవసరమని పేర్కొన్నారు. వృద్ధుల హక్కులు, సంక్షేమం, చట్టపరమైన రక్షణ గురించి అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమానికి సంబంధించిన చట్టపరమైన నిబంధనల గురించి వివరించారు. వృద్ధులను నిర్లక్ష్యం చేయడం, హక్కులకు భంగం కలిగించరాదని పేర్కొన్నారు. వృద్ధులకు హక్కులపై అవగాహన కల్పించడం, సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను చూపించడం న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశ్యాలలో భాగమని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ సేవదళ్ మండల అధ్యక్షునిగా శ్రీనివాస్

జహీరాబాద్, తెలంగాణ మంజీరా న్యూస్ :

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సేవదళ్ కోహీర్ మండల అధ్యక్షులుగా పుర్ర శ్రీనివాస్ నియమితులయ్యారు. మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సువర్ణ మల్లన్న పాటిల్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన పుర్ర శ్రీనివాస్ ను శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో సేవాదళ్ మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించి నందుకు కల్పించినందుకు, మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని, అభివృద్ధి పై వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ సర్పంచ్ అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం..

రజక సంఘం ఆగ్రహం

గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్యపై నిరసన..

సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు

తెలంగాణ మంజీరా//మెదక్ జిల్లా ప్రతినిధి,

మెదక్, అక్టోబర్ 13: మెదక్ పట్టణంలో ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం కావడం కలకలం రేపింది. పట్టణంలోని పాత ఎస్పీ కార్యాలయం సమీపంలో, నర్సాపూర్--చేగుంట సర్కిల్ పరిధిలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు తెలిసింది. మంగళవారం ఉదయం స్థానికులు గమనించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

ఘటనా స్థలానికి చేరుకున్న రజక, మరియు ఇతర సంఘాల ప్రతినిధులు

విగ్రహం ధ్వంసమైన విషయం తెలుసుకున్న రజక సంఘం సభ్యులు, ఇతర కుల సంఘాల ప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసన తెలిపారు. చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రంగంలోకి దిగిన పోలీసులు

సమాచారం అందుకున్న మెదక్ పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. విగ్రహం ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడిన చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం కావడంపై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రజక సంఘం సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

ఐలమ్మ విగ్రహా ధ్వంసంపై పద్మా దేవేందర్‌రెడ్డి ఆగ్రహం

-నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి.-సీసీ కెమెరాలు పనిచేయకుంటే పోలీసులు ఏం చేస్తున్నట్లు?

-డీఎస్పీ ప్రసన్నకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడిన మాజీ ఉపసభాపతి.

తెలంగాణ మంజీరా//మెదక్ జిల్లా ప్రతినిధి,

మెదక్ అక్టోబర్ 13 : మెదక్ పట్టణంలోని వెల్కమ్ బోర్డు సమీపంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడంపై మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధ్వంసమైన విగ్రహాన్ని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. విగ్రహం సమీపంలో నాలుగు సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఒక్కటి కూడా పనిచేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం నిజాం పాలకులు, రజాకార్లకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన గొప్ప వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. అటువంటి మహనీయురాలి విగ్రహాన్ని ధ్వంసం చేయడం సమాజాన్ని కలచివేసే విషయమని పేర్కొన్నారు. మహనీయుల విగ్రహాల పట్ల ఇలాంటి చర్యలకు పాల్పడేవారిని ఉపేక్షించకూడదని, బాధ్యులను గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెదక్ పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేయకుంటే పోలీసులు ఏం చేస్తున్నట్లు? అని ప్రశ్నించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందన్నారు. ఒక కీలక ఘటన జరిగిన తర్వాతే కెమెరాలు పనిచేయడం లేదనే విషయం వెలుగులోకి రావడం బాధాకరమని పేర్కొన్నారు. నేరాల నియంత్రణతో పాటు నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, అలాంటి కెమెరాలు పనిచేయకపోతే వాటిని ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. విగ్రహం సమీపంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ ఒక్కటి కూడా పనిచేయకపోవడానికి గల కారణాలను అధికారులు వెంటనే పరిశీలించాలని కోరారు. పట్టణంలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన కెమెరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

చూపాలని సూచించారు. కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా అనే విషయాన్ని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేయించాలని అన్నారు.

డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన పద్మా దేవేందర్‌రెడ్డి

చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంసం ఘటనపై మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్‌తో పద్మా దేవేందర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై తన ఆందోళనను వ్యక్తం చేస్తూ, వెంటనే పనిచేయని కెమెరాలకు మరమ్మతులు చేయించాలని సూచించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రతి సీసీ కెమెరాను నెలనెలా తనిఖీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, అవి పనిచేయని పరిస్థితి తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు. అదేవిధంగా విగ్రహ ధ్వంసం ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను త్వరగా గుర్తించాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. సీసీ కెమెరాల నిర్వహణ విషయంలో మెదక్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పట్టణంలో ఏం జరుగుతోంది? ప్రజల భద్రతకు సంబంధించి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై సంబంధిత శాఖలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కెమెరాల నిర్వహణ బాధ్యత ఏ శాఖ పరిధిలో ఉన్నప్పటికీ, అవి సక్రమంగా పనిచేసేలా పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని అన్నారు. కెమెరాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు అవసరమైన సాంకేతిక ఆధారాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ధ్వంసమైన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని తక్షణమే పునరుద్ధరించడంతో పాటు, ఆ ప్రాంతంలో తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని పద్మా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మహనీయుల చరిత్రను, వారి త్యాగాలను భావితరాలకు తెలియజేసే విగ్రహాల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని పేర్కొన్నారు. విగ్రహాలను ఏర్పాటు చేయడం ఎంత ముఖ్యమో, వాటిని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని, పట్టణంలోని అన్ని ప్రధాన విగ్రహాల వద్ద భద్రతా ఏర్పాట్లను సమీక్షించాలని కోరారు. పనిచేయని సీసీ కెమెరాలను వెంటనే మరమ్మతు చేయించి, ప్రతి నెలా వాటి పనితీరును తనిఖీ చేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. పోలీసు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణంలో భద్రతను పటిష్ఠం చేయాలని పద్మా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

గాయత్రీదేవి అలంకారంలో దుర్గామాత విశేష పూజలు

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

శ్రీ శరన్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు గాయత్రీదేవి అలంకరణతో సప్తప్రాకరయుత శ్రీ దుర్గా భవానీ మాతను భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం మండల పరిధిలోని ఈశ్వరపురంలో అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఉత్సవ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం పై త్వరలో పాత్రికేయుల పోరుబాట

-టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

తెలంగాణ మంజీరా //ఖమ్మం బ్యూరో

హైదరాబాద్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో మాట తప్పిన పాలకుల వైఖరి పై త్వరలో రాష్ట్రవ్యాప్త కార్యాచరణ చేపడతామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్ లోని ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టులు, టీజేయు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఏటీ రాజారావు, కే. రాజశేఖర్ యాదవ్ లతో పాటు పలువురు స్థానిక జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. ఈ సందర్భంగా వీరికి రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సభ్యత్వం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని అన్నారు. జర్నలిస్టుల ఇళ్ళస్థలాల విషయంలో ముఖ్యమంత్రి మాట తప్పారని, అక్రెడిటేషన్ కార్డుల పంపిణి వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైందని, జర్నలిస్టుల ఆరోగ్య సమస్య, సామాజిక భద్రతలను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల జర్నలిస్టులు అనేక ఇబ్బంది పడుతున్నారని, ఇంటి జాగల కోసం ఎదురు చూసి ఎంతోమంది జర్నలిస్టులు చనిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేక అనేక చిన్న, మధ్యతరహా పత్రికలు, కేబుల్ ఛానళ్ళు మూతపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పై త్వరలో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త కార్యాచరణ ఉంటుందని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ కు జర్నలిస్టులంతా అండగా ఉండాలని, జిల్లాల్లో సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. సంగారెడ్డి జిల్లాలో త్వరలో నూతన నాయకత్వంలో మహాసభ జరుగుతుందని తెలిపారు.

పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ

రూరల్ సీఐ. నయూమోద్దిన్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు ప్రయాణాలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని రూలర్ సీఐ. నయిూమోద్దిన్ సూచించారు. పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని, చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పండుగ సెలవుల్లో పిల్లలు చెరువులు, కుంటలు, కాలువలు, బావులు, ఈత కొలనుల వద్దకు ఒంటరిగా వెళ్లకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని ఈతకు వెళ్లే సమయంలో పెద్దలు తప్పనిసరిగా తోడుండాలని, నీటి లోతు తెలియని ప్రాంతాల్లోకి దిగకుండా చూడాలని తెలిపారు. పండుగల సందర్భంగా ప్రయాణాలు చేసేవారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. అతివేగం, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రజలందరూ పోలీసుల సూచనలు పాటిస్తూ వ్యక్తిగత భద్రతకు, కుటుంబ సభ్యుల రక్షణకు ప్రాధాన్యతనివ్వాలని దసరా, బతుకమ్మ పండుగలను ప్రజలందరూ సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

అన్నం పెట్టే రైతుకు కన్నీటి గోస

సాగుకు నీళ్లు కరువు...
బోరు వేస్తే చుక్క నీళ్లు లేవు
ఆరుగాలం శ్రమించిన పంట పాడు
ఎండిపోతున్న పంటలు...
విలవిలమంటున్న బ్రతుకులు...

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

దేశానికే అన్నం పెట్టే రైతు మీద గంగమ్మ తల్లి అలిగింది. ఈ సంవత్సరం వర్షాలు లేక చెరువు, కుంటలు, ప్రాజెక్టులు నీళ్లు లేక ఎండిపోయి అడుగంటిపోయాయి. రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఎండిపోయిన పంటను కాపాడు కుందామని బోర్లు వేస్తే చుక్క నీళ్లు రాక రైతులు లబోదిబో మంటున్నారు. జిల్లా కేంద్రమైన పుల్కల్ మండల్ కేంద్రమైన అన్నదాతలు హరిగోశలు ఎండుతున్న పంటలు కన్నీళ్లు పెడుతున్న రైతన్నలు జిల్లాలో అన్నదాతకు అడుగున పారి గోషాలు కనిపిస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి కొన్ని గింజలు పండించు కుందామని ఆశతో వేసిన వారి పొలాలన్నీ కరెంటు కోతలతో భూగర్భ జలాల అన్నదాత ఆక్రందనలు జిల్లాలోని పుల్కల్ మండలం బొంగులూరు గ్రామానికి చెందిన కేశవ శర్మ అనే రైతు దాదాపు కార్యక్రమాల పరిపాలం వేశారు ఇప్పటికే ఫలితం లేక పోవడంతో చివరి పాలితంగా చివరి ప్రయత్నం గా సోమవారం ఏడో గోరైన మరొకటి బోరును వేస్తున్నారు. ఆయన వరి పొలం పక్కనే మంజీరా పరివార్క ప్రాంతం ఉన్న ప్పటికీ ఉన్నప్పటికీ బోరులో చుక్కనీరు రాక పోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఇప్పుడు వేసిన బోర్ లో కొద్దిపాటి నీరు రావడంతో రైతు కాస్త ఊపిరి పీల్చుకొని ఉపశమనం పొందారు ఏది ఏమైనా జిల్లాలో రైతులు పంటలు చేతికందే సమయానికి ఎండిపోవడంతో ఆత్మ ఘోషలు వినిపిస్తున్నాయి. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి మార్గాలతో ప్రత్యామ్నాయ మార్గాలు చూయిస్తూ అన్నదాతకు అండగా నిలవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

భక్తులకు దర్శనమిచ్చిన దుర్గామాత

ప్రత్యేక పూజలు చేసిన దంపతులు

కోహిర్, తెలంగాణ మంజీరా న్యూస్ :

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రులను పురస్కరించుకొని మండల పరిధిలోని చింతల్ గట్టు గ్రామంలో దుర్గామాత విగ్రహానికి తమ్మలి తోట చంద్రశేఖర్ పాటిల్, శ్వేత పాటిల్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాత ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ పాటిల్ దంపతులు అమ్మవారి సన్నిధిలో శరణు వేడుకుంటూ గ్రామ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని, గ్రామంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. దుర్గామాత కృపాకటాక్షాలు అందరిపై ఉండి, ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నిండాలని ప్రార్థించారు.